# మెలకువ సందర్భం

కొండవీటి సత్యవతి

ఎమెస్కో

## ఇందులో వరుసగా...


| | |
|---|---|
| విందు తర్వాత... | 11 |
| గూడు | 21 |
| ఎగిసిపడిన కెరటం | 31 |
| చీకటిలోంచి చీకటిలోకి | 41 |
| సౌందర్యీకరణ హింస | 48 |
| కొత్త చూపు | 57 |
| మెలకువ సందర్భం | 60 |
| పాలపుంత | 66 |
| గంగకి వరదొచ్చింది | 76 |
| ఐతే... | 88 |
| హమ్ చలేంగే సాథ్ సాథ్ | 103 |
| ఆ గుండెల చప్పుడు | 115 |

“అన్వర్‌కి జరిగిన అన్యాయాన్ని పట్టించుకోకుండా దొంగచేతికే తాళాలిచ్చినట్లు తన కుటుంబాన్ని చంపినవాడి కొడుకుగా చలామణి కమ్మని ఆదేశించటం ఎంత అన్యాయం!”

# విందు తర్వాత...

చలి గడగడలాడించేస్తోంది. చేతివేళ్ళు కొంకర్లు పోతున్నాయి. గది మధ్యలోని బుఖారి[1] నుంచి వచ్చే వెచ్చదనం ఏ మాత్రం సరిపోవటం లేదు.

“అబ్బ! ఇంత చలేమిట్రా బాబూ! ఎలా భరిస్తున్నావ్” మాధవి అతికష్టం మీద అంది. చలికి పళ్ళు టక టక కొట్టుకుంటున్నాయి.

“ఏం చేయమంటావ్ భరించక. అయినా నిన్ను చలికాలంలో కాశ్మీర్ రమ్మని ఎవడు చెప్పాడు” అని “హనీఫ్ కాంగ్డీ[2] లావో” అన్నాడు.

“నాకేం తెలుసురా బాబూ! మరీ ఇంత భయంకరంగా వుంటుందంటే ఢిల్లీ నుంచే వెనక్కి వెళ్ళిపోయేదాన్ని” సుధాకర్ మాట్లాడకుండా సమోవాయ్[3] లోంచి వేడి వేడి టీ పోసి ఇచ్చాడు.

టీ తాగుతూ బుఖారీకి దగ్గరగా జరిగింది మాధవి. వెచ్చటి టీ గొంతులోకి జారుతుంటే హాయిగా వుంది. ఈ సీజన్‌లో ఇక్కడికి రావడం ఎంత బుద్ధి తక్కువో అర్థమైంది మాధవికి.

ఢిల్లీలో ఏదో మీటింగ్ అటెండవ్వడానికి వచ్చింది. అది నిన్న ఉదయమే అయిపోయింది. తన పిన్ని కొడుకు సుధాకర్ శ్రీనగర్‌లో మిలటరీలో మంచి హోదాలో ఉన్నాడని ఎలాగైనా ఒకసారి శ్రీనగర్ వెళ్ళాలని మాధవి ఎప్పటినుంచో అనుకుంటోంది.

అయితే ప్రస్తుతం చాలా చలిగా వుంటుందని సుధాకర్ చెప్పినా వినకుండా వచ్చింది. సరే వస్తానంటే వద్దనడం ఎందుకులే అని సుధాకర్ ఊరుకున్నాడు.

"వదిన ఎపుడొస్తుందిరా" మాధవి అడిగింది.

"లంచ్ టైముకి వస్తుందిలే. ఏం ఆకలేస్తోందా?" నవ్వుతూ అన్నాడు సుధాకర్.

"ఆకలా? పాడా? పొద్దున్న తిన్నదే అరగలేదింకా".

"రెండు రోజులైతే అలవాటవుతుందిలే. నేను బయటకెళ్ళి వస్తా. ఒక్కర్తివీ ఉండగలవా?"

"దివ్యంగా వుంటాను. నాకేం భయం. ఎవరైనా తుపాకులిచ్చుకుని వస్తారంటావా?"

"దివ్యంగా వుంటానని మళ్ళీ తుపాకులంటావేంటీ?"

"ఏమో బాబూ! ఎక్కడ చూసినా సైన్యం, పోలీసులే. ఇక్కడ మామూలు మనుష్యుల కన్నా పోలీసులే ఎక్కువ వున్నట్టున్నారు."

"నేచురల్లీ! లా అండ్ ఆర్డర్ ప్రాబ్లమ్ చాలా వుంది. ఏ టైములో ఎక్కడ ఏం జరుగుతుందో తెలియదు".

"కన్పిస్తూనే వుందిగా. సరే. నేను టి.వి. చూస్తుంటాను నువ్వెళ్ళి రా" అంది ధైర్యంగానే.

"వద్దులే మధూ! వదిన వచ్చాక వెళతాలే"

"అయ్యో! నీకేం పనులున్నాయో వెళ్ళరా! నిజంగానే చెబుతున్నా. నాకేం భయం లేదు."

"అంత అర్జంటేమీ కాదులే. ఇవాళ ఎలాగూ ఆదివారం కదా. ఆ... అన్నట్టు మర్చిపోయాను. సాయంత్రం మనం డిన్నర్‌కి బయటకెళ్ళాలి. వదిన చెప్పిందా?"

"చెప్పలేదే! అయినా ఈ చలిలో బయటకెలా వెళతాంరా బాబూ" "తప్పకుండా వెళ్ళాలి. మాపై ఆఫీసర్ కూడా వస్తాడు"

బయట కారాగిన చప్పుడైంది.

"వసు వచ్చినట్టుంది" సుధాకర్

లాంగ్ కోటు, మంకీ కాప్‌తో వసుధ లోపలికొచ్చింది.

"తొందరగా వచ్చినట్టున్నావే"

"అవును. మధుకోసం తొందరగా వచ్చేసా. అయినా హాస్పిటల్‌లో కూడా పని ఎక్కువ లేదు."

వసుధ మిలటరీ హాస్పిటల్‌లో డాక్టరుగా పనిచేస్తోంది.

"వదినా బయటెలా వుంది"

"చలి గురించా. చలిగానే వుంది. మాకు అలవాటయి పోయిందిలే" అంది కోటూ, కాప్ తీసేస్తూ

"వసూ! ఈవినింగ్ డిన్నర్ గురించి మధుకి చెప్పలేదట."

"అవును. ఉదయం హడావుడిలో మర్చిపోయాను".

"సరే! లంచ్ చేద్దామా!"

వంటచేసే హనీఫ్ వేడివేడిగా వడ్డించాడు.

"రాజ్‌మా కూర చాలా బావుంది. మధూ! ఇంకొంచం వేసుకో." వసుధ.

"బావుంది. ఇవి మనవేపు బొబ్బర్లలాగా లేవూ".

"అదే జాతిలే. పన్నీర్ వేసుకో. ఈ చలికి బావుంటుంది".

"మధూ! నువ్వింకా కథలూ, కవితలూ రాస్తున్నావా? మానేసావా?

"రాస్తూనే వున్నాను. ఈ మధ్యనే నా కథల సంపుటి ప్రచురించాను"

"అవునా! మరి నాకు పంపలేదే"

"నీకా?! నువ్వు కథలు కూడా చదువుతావా? తీవ్రవాదులు, ఎన్‌కౌంటర్లూ. వీటిలోనే మునిగి తేలతావనుకున్నాను"

"భలేదానివి మధూ! అది ఉద్యోగం. అవన్నీ ఉద్యోగ ధర్మాలు. నేను కూడా రాసేవాడినని మర్చిపోయావా?"

"అవుననుకో. కాని అదెప్పటి మాట. నువ్వు సాహిత్యం సంగతే మర్చిపోయావనుకున్నాను".

వీళ్ళిద్దరి సంభాషణని వసుధ ఆసక్తిగా వింటోంది. సుధాకర్ కథలూ గట్రా రాసేవాడని ఆమెకు అస్సలు తెలియదు.